ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 6 ఆగస్టు 2025



# బోనస్ రాకపాయె

| యాసంగిలో విక్రయించిన సన్నరకం ధాన్యం వివరాలు.. | |
|---|---|
| మండలం | మెట్రిక్ టన్నుల్లో |
| బోయిన్‌పల్లి | 16.280 |
| చందుర్తి | 42.040 |
| గంబీరావుపేట | 710.960 |
| ఇల్లంతకుంట | 20.080 |
| కోనరావుపేట | 2,128.560 |
| ముస్తాబాద్ | 583.120 |
| రుద్రంగి | 25.280 |
| సిరిసిల్ల | 104.920 |
| తంగళ్లపల్లి | 392.800 |
| వీర్నపల్లి | 1,502.640 |
| వేములవాడ | 146.120 |
| వేములవాడరూరల్ | 284.080 |
| ఎల్లారెడ్డిపేట | 3,297.520 |
| **మొత్తం** | **9,254.400** |





● జాడలేని సన్నరకం ధాన్యం బోనస్ డబ్బులు
● రైతులకు తప్పని ఎదురుచూపులు
● జిల్లాలో రూ.4.62 కోట్లు పెండింగ్..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి నాట్లు చివరి దశకు చేరుకుంటున్నాయి. వానాకాలం సీజన్లో పెట్టుబడికి ఉపయోగపడుతుందని భావించిన రైతులకు సన్న రకం ధాన్యం బోనస్ డబ్బులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా సన్న రకం ధాన్యం బోనస్ డబ్బుల జాడే లేదు. మరోవైపు రైతులకు వరిసాగు భారంగా మారింది. ఒకవైపు వానాకాలం పంటల సాగు పెట్టుబడి పెరిగింది. దీనికి తోడుగా ఎరువుల ధరలు కూడా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ పరిస్థితుల్లో పంటల సాగుకు ఉపయోగపడుతుందని సన్న రకం వైపు మొగ్గు చూపిన రైతులకు సకాలంలో బోనస్ డబ్బులు రాకపోవడంతో ఆవేదన మిగిలిస్తోంది. జిల్లాలో ఇప్పటికే వానకాలం సీజన్లో 1.84 లక్షల ఎకరాల వరి సాగులో 1.45 లక్షల ఎకరాలు నాట్లు వేసుకున్నారు. నాట్లు చివరి దశకు వచ్చిన యాసంగికి సంబంధించిన సన్న రకం ధాన్యం బోనస్ డబ్బులు మాత్రం రావడం లేదు. అయినా జిల్లా రైతులు సన్నరకం వైపు మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో దొడ్డు రకం వరి సాగుతో పాటు పది వేల ఎకరాలకు పైగా సన్న రకం ధాన్యం పండించే దిశగా నాట్లు వేసుకుం టున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో తప్పనిసరిగా సన్నరకం ధాన్యానికి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో సన్న రకం ధాన్యానికి ఆదరణ ఉండ డంతో రైతులు గతంలో కంటే ఎక్కువగా సన్న రకం సాగు వైపు మొగ్గు చూపు తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ మాత్రం సకాలంలో ఇవ్వకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

**సన్నాల వైపు మొగ్గు..**

సన్నరకం వరి సాగు వైపు రైతులను మళ్లించే దిశగా గత వానకాలం సీజన్ నుంచి సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా రైతాంగం సన్నాల వైపు మొగ్గు చూపారు. ఈసారి యాసంగి ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో పూర్తిచేసిన సన్న రకం వడ్లు క్వింటాలుకు రూ.500 చొప్పున ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కోసం మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. వానాకాలం సీజన్లో రైతులు సన్న వడ్లను మిల్లర్లు, వ్యాపారులకు నేరుగా విక్రయించారు. ఈ సారి యాసంగి సన్న రకం ధాన్యం మాత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన

మిగతా 8వ పేజీలో

| జిల్లాలో ఖరీఫ్ సాగు ఇలా.. | | | | |
|---|---|---|---|---|
| మండలం | వరి | పత్తి | ఇతర | మొత్తం |
| గంబీరావుపేట | 18,600 | 200 | 530 | 19,330 |
| ఇల్లంతకుంట | 24,000 | 12,500 | 1,970 | 38,470 |
| ముస్తాబాద్ | 23,000 | 600 | 1,650 | 25,250 |
| సిరిసిల్ల | 4,900 | 850 | 103 | 5,853 |
| తంగళ్లపల్లి | 19,950 | 1,000 | 1,081 | 22,031 |
| వీర్నపల్లి | 8,360 | 400 | 32 | 8,792 |
| ఎల్లారెడ్డిపేట | 17,500 | 3,600 | 30 | 21,130 |
| బోయినపల్లి | 13,000 | 7,000 | 1,310 | 21,310 |
| చందుర్తి | 15,200 | 6,200 | 210 | 21,610 |
| కోనరావుపేట | 18,200 | 4,800 | 700 | 23,700 |
| రుద్రంగి | 5,900 | 3,400 | 805 | 10,105 |
| వేములవాడ | 5,200 | 5,010 | 368 | 10,578 |
| వేములవాడ రూరల్ | 11,050 | 4,200 | 364 | 15,614 |
| మొత్తం | 1,84,860 | 49,760 | 9,153 | 2,43,773 |

## బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి

**- ఇంటర్‌మీడియట్ ప్రత్యేకాధికారి రమణారావు**



డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమణారావు

ఇల్లంతకుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఉమ్మడి జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యామండలి ప్రత్యేకాధికారి రమణారావు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న డిజిటల్ తరగతులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు ప్రభుత్వ కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకొని చదువుపై దృష్టినిలుపాలన్నారు. విద్య ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చుతుందన్నారు. అధ్యాపకులు సాంకేతికతో కూడిన బోధన చేయాలన్నారు. విద్యార్థుల ప్రగతికి తీసుకుంటున్న చర్యలు, హాజరుశాతం, బోధన పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు నయిమొద్దీన్, సతీష్‌రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మన్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేసుకోవాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

కోనరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కోనరావుపేట మండలంలోని మర్తనపేట పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో కలకుంట్ల రమణ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటిని త్వరగా పూర్తిచేసుకోవడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇంటిని పూర్తిచేయడంపై యజమానిని అభినందించారు. ఇంటికి బేస్‌మేట్, రూఫ్ లెవెల్ కింద ఇప్పటికే రూ.2 లక్షలు లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని వెల్లడించారు. ఆర్‌సీ లెవెల్ పూర్తయినందున చివరి చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. తన భర్తకు కంటి సమస్య ఉందని, ఆదుకోవాలని రమణ కలెక్టర్‌కు విన్నవించారు. సిరిసిల్ల పట్టణంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో వైద్యం చేయించాలని అధికారులకు ఆదేశించారు.

## పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం..



పట్టు పరిశ్రమపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చందుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టు పరిశ్రమతో రైతులు మంచి ఆదాయం పొందవచ్చని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి జగన్‌రావు పేర్కొన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో దేవుని తండా, లింగంపేట ,జోగాపూర్ కిష్టంపేట, నర్సింగాపూర్, వేములవాడ రూరల్ మండలం వెంకటంపల్లి, బాలరాజుపల్లి గ్రామాల రైతులకు పట్టు పరిశ్రమపై మైసూర్‌లోని సీఎస్బీ-సీఎస్ఆర్టీఐ శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లికార్జున, డి. బైవోల్టెన్ పట్టు పురుగుల పెంపకం, తెలంగాణలో రైతుల ఆర్థిక స్థితి మెరుగుదలలో దాని ప్రభావం, నాణ్యమైన పట్టు కాయలు ఉత్పత్తికి సంబంధించిన పద్ధతులపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తూ పట్టు పరిశ్రమను ప్రోత్సహిస్తోందన్నారు. తక్కువ శ్రమతో, అతి తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని పేర్కొన్నారు. మల్బరీ సాగు వైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాఘవేంద్రరావు, 41 మంది రైతులు పాల్గొన్నారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును పటిష్టపర్చాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రజిత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వంద శాతం ప్రగతి సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకునే జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.మాతాశిశు మరణాలు తగ్గించే దిశగా అందరూ పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సారియాఅంజుమ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా శ్రావణ శోభ..

**- పూజా సామగ్రి విక్రయ కేంద్రాల వద్ద సందడి**

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పూజలు.. నోములు.. వ్రతాలకు నెలవైనది శ్రావణమాసం. ఇంటింటా శ్రావణ శోభ కనిపిస్తోంది. శ్రావణం, కార్తీక మాసాల్లో మహిళలు జరుపుకునే వివిధ రకాల వ్రతాల్లో ఎంతో విశిష్టత ఉంది. పూజలు, వ్రతాలు జరుపుకోవాలంటే అనేక పూజా సామగ్రి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. భక్తుల సమయం వృథా కాకుండా జిల్లా కేంద్రంతో పాటు వేములవాడలో పూజా దుకాణాలు ఏర్పాటుచేసి విక్రయాలు జరుపుతున్నారు. దీంతో పూజా సామగ్రి అంతా ఒకేచోట దొరకడంతో ప్రజలు పూజా విక్రయ కేంద్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. శ్రావణ మాసంలో మంగళగౌరి వ్రతం, వరలక్ష్మి వ్రతాలతో పాటు అమ్మవారి పూజలు, కార్తీక మాసంలో నాగుల చవితి, కార్తీక పౌర్ణమి రోజు ప్రత్యేక పూజలు జరుపుకుంటారు. ఇంటిల్లిపాదికి శుభం కలగడానికి చేసే పూజల ఫలితాల కోసం రకరకాల వస్తువులను కూడా ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో పూజలనగానే వస్తువుల కొనుగోలు కోసం వివిధ దుకాణాలు తిరిగి సేకరించుకునే అవసరం ఉండేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండాపోయింది. జిల్లావ్యాప్తంగా ఏ చిన్న పట్టణానికి వెళ్లినా ప్రత్యేకమైన పూజా సామగ్రి దుకాణాలు దర్శనమిస్తాయి. ఆ దుకాణాల్లో ఆవు నెయ్యి, నువ్వుల నూనె, అష్టమూలికల తైలం, ఇప్ప నూనె, పరిమళ ద్రవ్యంలు, అగరవత్తులు, నవధాన్యాలతో పాటు ఇంకా అనేక వస్తువులు లభిస్తున్నాయి.

## అంజన్న ఆలయ అభివృద్ధి పనులను మొదలుపెట్టాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులను మొదలుపెట్టాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ ఆలయం వద్ద రూ.31లక్షలతో ఆర్చి, ప్రాకారం సాలాహారంతో కలిపి కమాన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మంగళవారం ఆలయం వద్ద పరిశీలించి ఈవో శ్రీనివాస్‌లు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం వెళ్లే సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారి మధ్య నుంచి 50ఫీట్ల దూరం విడిచిపెట్టి ఆర్చి, ప్రాకారం సాలాహారంతో కలిపి కమాన్ నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఇటీవలే పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు.

## బద్దిపోచమ్మ తల్లికి బోనం మొక్కులు..

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడు తల్లీ.. అంటూ భక్తులు పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ తల్లి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి పట్నంవేసి నూతన వస్త్రాలను, నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం బద్దిపోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
8
బూటకపు నివేదికలతో ప్రభుత్వం కుట్ర..
- నాప్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

## పకడ్బందీగా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలు

**- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - కలెక్టరేట్‌లో అధికారుల సమీక్ష..**



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలను కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్న పిల్లందరికి, అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఈనెల 11న అల్బెండజోల్ మాత్రలు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్‌లు, వర్కర్‌లతో ఈనెల 11, విద్యాసంస్థలు, కళాశాలలు, ఇంటింటికి వెళ్లి 19సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను వందశాతం వేయాలన్నారు. ఒకవేళ 11వ తేదీన మాత్రలను వేసుకోలేని వారికి ఈనెల 18న మాప్ ఆఫ్‌డే రోజున తప్పకుండా అందించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరిచొప్పున అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు, మెప్మా సిబ్బంది పర్యవేక్షక అధికారులుగా విధులు నిర్వహించాలన్నారు. అవగాహన ర్యాలీలు, నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రజలతోపాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో అల్బెండజోల్ మాత్రలను 19ఏళ్ల పిల్లలందరికి వేయాలన్నారు. దీనిపై పట్టణాలు, గ్రామాల్లో చాటింపు వేయాలని సూచించారు. సంవత్సరం నుంచి రెండేళ్లలోపు పిల్లందరికి సగం మాత్రలు మాత్రమే నీటిలో కలిపి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచాలయ్య, డాక్టర్ నయిమా, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి, ఇంటర్ విద్యాధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీపీఆర్‌వో వి శ్రీధర్, డీపీవో షరీఫోద్దిన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 5(అంధ్రజ్యోతి): ఉపాధ్యాయులతో పాటు విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈనెలాఖారులోగా పూర్తిచేయాలన్నారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాల్గొని ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా యూఎస్‌పీసీ నాయకులు పాతూరి మహేందర్‌రెడ్డి, గోల్కొండ శ్రీధర్, అయిల్నేని రాజేశ్వర్‌రావు, పర్కాల రవీందర్, దుమాల రామానాథ్‌రెడ్డి, జంగిటి రాజు, విక్కుర్తి అంజయ్యలు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించడంతోపాటు బదిలీలు, పదోన్నతులను చేపట్టాలన్నారు. పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, 317 జీవో వలన నష్టపోయిన ఉపాధ్యాయులందరికి వారివారి సొంత జిల్లాలకు బదిలీలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను సవరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల 29రోజుల సమ్మె కాలపు జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. టైంస్కేల్ ఇవ్వాలని వివిధ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్, పార్ట్‌టైం అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. నూతన జిల్లాలకు జిల్లా విద్యాధికారి పోస్టులతోపాటు ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ డీఈవో, నూతన మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేసి ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో యూఎస్‌పీసీ నాయకులు అవురం సుధాకర్‌రెడ్డి, వంగ తిరుపతి, శ్రీహరి, గొల్లపల్లి శ్రీనివాస్, పాముల స్వామి, గాలిపెల్లి సంతోష్, కోటగిరి లక్ష్మణ్, ఉపేందర్, ఎం తిరుపతి, రామచంద్రం, చక్రపాణి, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, గణేష్, శంకర్, విష్ణు, భాస్కర్, మధుసూధన్, సతీస్ తదితరులు పాల్గొన్నారు.

## కోతలతో బీడీ కార్మికుల వేతనాల దోపిడీ..



మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు అనసూర్య

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బీడీ టేకేదారులు కోతలతో కార్మికుల వేతనాల్లో దోపిడీకి పాల్పడుతున్నారని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు కేవీ అనసూర్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం కార్మిక భవనంలో తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనసూర్య మాట్లాడారు. దేశంలో లక్షలాది మంది బీడీ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేస్తున్నారని అన్నారు. బీడీ రంగంపై అనేక ఆంక్షలను ప్రభుత్వాలు విధిస్తూ విదేశీ సిగరేట్‌లను దేశంలోకి తీసుకొస్తున్నాయని విదేశీ సిగరేట్ అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రభుత్వాలు బీడీ కార్మికుల నోట్లో మన్నుకొట్టి విదేశీ సిగరేట్లను ఆహ్వానిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీడీ టేకేదారులకు కంపెనీలు కమీషన్ ఇస్తున్నా కార్మికుల నుంచి ప్రతినెల రూ. 2వేల నుంచి రూ. 3వేల వరకు బీడీల కోత పెడుతూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో బీడీ కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని, వీడీఏ ప్రకారం బీడీ కార్మికులు వెయ్యి బీడీలకు రూ.261.97 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌వో పెన్షన్ 6వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 4016 ఆసరా పెన్షన్ సౌకర్యంను బీడీ కార్మికులకు వెంటనే కల్పించాలని, బీడీ కార్మికులకు డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. టేకేదారులు ఆకుతుట్టి, తంబాకు తుట్టితో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోమన్నారు. టేకేదారులు ఇతర సరుకులు తయారుచేసే ఫ్యాక్టరీలను పెట్టుకొని ఆ సరుకులను బలవంతంగా బీడీ కార్మికులకు అంటగట్టడం మానాలని హెచ్చరించారు. వర్తి బీడీ లేకుండా బీడీ కార్మికులందరికి పీఎఫ్ నంబర్ ఉండేలా టేకేదారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈపీఎఫ్‌వోలో కార్మికుల వారసులు బెనిఫిట్స్ పొందే విషయంలో వేధిస్తున్నారని, నిబంధనలను సడలించి ఆధార్‌తో సంబంధం లేకుండా ప్రూఫ్‌ల ఆధారంగా బెనిఫిట్స్ అందించాలని అన్నారు. అన్ని రంగాల కార్మికులతో నెలకు ఒక్కరోజైనా లేబర్ అధికారులు సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా నాయకులు అజ్జ వేణు, కడారి రాములు, నల్ల చంద్రమౌళి, రేగుల అనిత, గుమ్మడవెల్లి మంజుల, సుంకనపెల్లి శాంతమ్మ, ఎంజాల లక్ష్మి, గాజుల రాధ పాల్గొన్నారు.

# భూభారతి సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన

● సిబ్బంది లేక దరఖాస్తుల పరిశీలనలో జాప్యం



విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భూభారతి సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను మండల రెవెన్యూ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ఒక్కోక్కటిగా పరిష్కరిస్తున్నారు. సిబ్బంది తక్కువ ఉండడంతో సమస్యలను సరైన సమయంలో పరిష్కరించలేక పోతున్నారు. అడ్డంకులను అధిగమిస్తూ ఆగస్టు 15 వరకు వంద శాతం సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

కరీంనగర్ రూరల్ మండలంలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మొత్తం 14 రెవెన్యూ గ్రామాల్లో 2,467 దరఖాస్తులు వచ్చాయి. వీటిని భూభారతి పోర్టల్‌లో నమోదు చశారు. వీటిలో సాదాబైనామా దరఖాస్తులను మినహా ఒక్కో దరఖాస్తును పరిశీలించి గ్రామాల వారిగా నోటీసులు జారీ చేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో రెండు నుంచి మూడు రోజుల పాటు మోఖాపైకి వెళ్లి విచారణ నిర్వహిస్తున్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు వారసత్వ పట్టాలను జారి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలను మాత్రం ఇవ్వడం లేదని అధికారులు తెలిపారు. వివాద రహిత దరఖాస్తులను మాత్రమే పరిష్కరిస్తుండగా కోర్టు కేసులు, ఇతర భూ వివాదాలు ఉన్న దరఖాస్తులను పక్కన పెడుతున్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు భూపతిపూర్ విద్యార్థి

రాయికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సంద్రుగు ప్రవస్తి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రవస్తి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-12 గర్ల్స్ విభాగంలో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించి జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేత వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రమేష్‌రెడ్డి ప్రోత్సాహకంగా నగదు అందజేశారు. కార్యక్రమంలో పీడీ రాజగోపాల్, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, యూత్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, విక్రమ్, రవిష్ రెడ్డి, టీవీ గోపాల్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

# అన్నింటా సాంకేతికత

● ఆధునిక టెక్నాలజీతో దొంగతనాలు..
● అదే టెక్నాలజీతో పోలీసుల కేసుల ఛేదన





కరీంనగర్ క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత దానిని అన్ని అంశాల్లో ఉపయోగిస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి దొంగలు, ఇతర నేరస్థులు నేరాలకు పాల్పడుతున్నారు. ఆధారాలు లేకుండా చేస్తూ పోలీసుల నుంచి తప్పించుకుం టున్నారు. అదే టెక్నాలజీని ఉపయోగించి పోలీసులు నిందితులను పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతికత రెండు వైపులా పదునున్న కత్తిలా మారింది.

### ఆధారాలు చిక్కకుండా జాగ్రత్తలు

దొంగతనాలకు, నేరాలు జరిగినప్పుడు పోలీసులు ఆ స్థలంలో నేరస్థుల వేలిముద్రలు సేకరిస్తుంటారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తారు. ఆ ప్రాంతంలో నేరం జరిగిన సమయంలో మొబైల్ ఫోన్ల డంపు ద్వారా నేరస్థులను గుర్తించేందుకు ప్రయత్నిస్తారు. నేరస్థులు పోలీసులకు చిక్కకుండా, ఎలాంటి ఆధారాలు లభించకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా వేలిముద్రలు దొరకకుండా చేతులకు గ్లౌస్‌లు, సీసీ కెమెరాలో కనపడకుండా ముఖానికి ముసుగులు, మాస్క్‌లు వాడుతున్నారు. నేరం చేసిన స్థలంలో ఫోన్‌ను వాడకుండా వాకీటాకీ ఉపయోగిస్తున్నారు. సొంత వాహనాలను ఉపయోగిస్తే వాహనాల నంబర్‌తో పోలీసులు చిక్కుతామని దొంగతనాలకు పాల్పడే సమయంలో చోరీ చేసిన వాహనాలను వినియోగిస్తున్నారు.

### సాంకేతికత సహాయంతో పోలీసులు ఛేదించిన కేసులు

ఐదేళ్ల క్రితం కరీంనగర్‌లో హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని రాధిక కేసులో సంఘటనాస్థలంలో నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. హైదరాబాద్ సిటీ పోలీసు నుంచి క్రైం ఆఫీసర్(సీఎస్‌ఓ) ఇంద్రాణి(ఫోరెన్సిక్ సైన్స్) ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల టీం రాధిక హత్య జరిగిన గదిని పరిశీలించి పలు ఆధారాలను సేకరించింది. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో రక్తపు మరుకలు శుభ్రం చేసినప్పటికీ తెలుసుకునే వీలుంది. 3డీ క్రైం సీన్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, 3డీ స్కానర్ (ఫారో), బాడీ ఫ్లూయిడ్ కిట్‌లతో కీలక ఆధారాలను సేకరించారు. చివరకు కన్నతండ్రే హంతకుడని గుర్తించారు

● కరీంనగర్‌లోని శ్రీపురం కాలనీలో ఒక వ్యక్తిని బాత్‌రూంలో బంధించి, అందులోకి వంట గ్యాస్‌ను వదిలి శ్వాసాడకుండా చేసి హత్య చేశారు. అదృశ్యం కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతుండగా తన బ్యాంక్ ఖాతాలో అర్జంటుగా 50 వేలు జమచేయాలని ఒక రోజు మృతుడి ఫోన్ నుంచి అతని తండ్రికి మెస్సేజ్ వచ్చింది. డబ్బులు జమ చేసిన తర్వాత నిందితులు సిద్దిపేటలోని ఏటీఎం సెంటర్ నుంచి డబ్బులు డ్రా చేస్తుండగా సీసీ కెమెరా పుటేజి ద్వారా గుర్తించి అరెస్టు చేశారు.

● రెండేళ్ల క్రితం కరీంనగర్ మంచిర్యాల చౌరస్తాలో ఒక టాటాసుమోతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఒక మహిళా ఉద్యోగిని హత్య చేశారు. తీవ్ర గాయాలతో వారం రోజుల తరువాత మహిళ మరణించగా, 15 రోజులకు భర్త కోలుకుని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఈ హత్య వెలుగు చూసింది. మొదట ప్రమాదంగానే పోలీసులు కేసు నమోదు చేయగా, సీసీ కెమెరా పుటేజీ, కాల్ డేటాతో నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

● కరీంనగర్‌లో మాయమవుతున్న లారీలు తెల్లవారేసరికి మహారాష్ట్రలోని పర్బనీ ప్రాంతంలో తేలుతున్నాయి. గుర్తించేలోగానే 24 గంటల్లో ఆ లారీలు స్క్రాప్‌గా మారుతున్నాయి. మహారాష్ట్ర కేంద్రంగా స్క్రాప్ మాఫియా దేశవ్యాప్తంగా లారీలను దొంగిలించి పర్బనిలో గుట్టుచప్పుడు కాకుండా తుక్కుగా మారుస్తున్నది. కరీంనగర్‌లో చోరీకి గురైన లారీకి జీపీఎస్ బిగించి ఉండడంతో లారీ ఎక్కడికి వెళ్లిందనేది గుర్తించి నిందితులను అరెస్టు చేశారు.

### కారులో తిరుగుతూ.. గూగుల్ మ్యాప్స్‌లో గుర్తిస్తూ..

ప్రస్తుతం గూగుల్ మాప్స్ ప్రజలకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. అదే గూగుల్ మ్యాప్ సహాయంతో దొంగతనాలు చేయడం పోలీసులతోపాటు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. పొరుగు జిల్లా నిజామాబాద్‌కు చెందిన ఒక యువకుడు కరీంనగర్‌కు వచ్చాడు. ఇక్కడ తాళం వేసిన ఇళ్లను గుర్తించేందుకు పగలు తన కారులో నగరంలో తిరిగేవాడు. ఈ ప్రాంతానికి కొత్త కావడంతో రాత్రి వేళ దారి మర్చిపోతానేమోనని ఆయా ఇళ్ల లోకేషన్లను గూగుల్ మ్యాప్స్‌లో గుర్తించేవాడు.



అర్ధరాత్రి వేళ గూగుల్ మ్యాప్ సహాయంతో ఆయా ఇళ్ల వద్దకు వెళ్లి తన పని పూర్తి చేసుకునే వాడు. ఇలా వారం రోజుల్లోనే 10 ఇళ్లలో దొంగతనం చేశాడే. 25 లక్షల వరకు సొమ్ములు అపహరించాడు. కరీంనగర్ పోలీసులు చివరకు ఆ దొంగను అదే ఆధునిక టెక్నాలజీ ద్వారా పట్టుకుని కటకటాల వెనక్కినెట్టారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రం లోని కొత్త బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తు పడితే 87126 56815 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని టౌన్ సీఐ కరుణాకర్ ఒక ప్రకటనలో కోరారు.

## అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

చిగురుమామిడి,అగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన బల్ల బాలయ్య (55) అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం ఉరి వేసుకొని అత్యహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలయ్య అనేక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు పెరగడంతో వాటిని తట్టుకోలేక మానసిక ఒత్తిడికి లోనై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వెసుకుని ఆత్యహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలం కోర్కల్ గ్రామ శివారులో నుంచి శంకరపట్నం మండలంలోని లింగాపూర్ గ్రామం మీదుగా హుజూరాబాద్‌కు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ సుద్దాల దేవుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కేజీవీల్ ట్రాక్టర్ సీజ్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దంపేట గ్రామ శివారులో తారు రోడ్డుపై జక్కుల కుమార్‌కు చెందిన కేజీవీల్స్ టీఎస్ 2250 ట్రాక్టర్‌ను నడుపుకుంటు వెళుతున్నాడు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. ఎవరైనా తారురోడ్డుపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపిస్తే జరిమానాలతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

## మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 52మంది మందుబాబులకు మంగళవారం జరిమానా విధిస్తూ సిరిసిల్ల రెండవ శ్రేణి మెజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకార.. సిరిసిల్ల పట్టణంలో 14రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 52మంది మందుబాబులు పట్టుబడ్డారు. వీరికి ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించవాహనాలు నడపమని ప్రతిజ్ఞచేయించారు. అనంతరం 52మందిని కోర్టులో హాజరుపరచగా 14మందికి రూ. 4వేలు, 38మందికి ఒక్కొక్కరికి రూ. 1000 జరిమానా విధించారు. 52మందికి మొత్తం రూ. 94వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

# రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా రోడ్డు ప్రమాదం

● ఒకరి మృతి .. ఆరుగురికి గాయాలు ● దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన



నరేష్ (ఫైల్)



ప్రమాదానికి గురైన కారు



చికిత్స పొందుతున్న విద్యార్థి

కోరుట్ల రూరల్, అగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గాడిపల్లి నరేష్ దుబాయ్‌లో ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం కొమురవెల్లి, యాదగిరిగుట్ట, వేములవాడకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇంకో రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా మంగళవారం తెల్లవారుజామున వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టగా నరేష్(35) అక్కడికక్కడే మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నారు.

గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిపల్లి నరేష్ అతని భార్య శిరీష ఇద్దరు పిల్లలు కార్తిక, విహాన్, అతని స్నేహితుడు బొల్లంపల్లి శ్రీనివాస్-సుజాత దంపతులతో పాటు కూతురు జశ్వితలతో కలిసి సోమవారం ఉదయం కొమురవెల్లి, యాదగిరిగుట్ట, వేములవాడ దైవదర్శనానికి కారులో వెళ్లారు. దైవదర్శనం చేసుకొని వేములవాడ మీదుగా కోరుట్ల మండల అయిలాపూర్ సమీపానికి చేరుకున్న వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న గాడిపల్లి నరేష్ అక్కడిక్కడే మృతి చెందగా, అతని భార్య శిరీషకు రెండు చేతులు విరిగాయి. శ్రీనివాస్‌కు వెన్ను భాగంలో గాయాలయ్యాయి. శ్రీనివాస్ భార్య సుజాత కాలు విరిగిపోగా ముగ్గురు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయాన్ని శ్రీనివాస్ గ్రామస్థులతో పాటు పోలీసులు, అంబులెన్స్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న గ్రామస్థులు ప్రత్యేక వాహనం ద్వారా క్షతగాత్రులను కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రత్యేక వాహనం ద్వారా జగిత్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. నరేష్ కారు నడుపుతున్న సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోకపోడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. పక్కన కూర్చున్న శ్రీనివాస్ సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు ప్రమాదానికి నిద్రమత్తే కారణమని తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ చిరంజీవి పరిశీలించారు. మృతుడు నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో బోల్తా.. 8 మంది విద్యార్థులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో మంగళవారం కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై కుక్కలను తప్పించబోయిన ఆటో బోల్తా పడింది. రాచర్లగొల్లపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మలాంగ్ 8 మంది విద్యార్థులను వాహనంలో ఎక్కించుకుని ఎల్లారెడ్డిపేట శివారులోని ప్రైవేటు పాఠశాల వైపు వెళుతుండగా కుక్కలు అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8 మంది విద్యార్థులు గాయపడ్డారు. గాయపడిన వారిలో మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్‌తండాకు చెందిన పదో తరగతి విద్యార్థులు హర్షద్, కైఫ్, వైభవ్, నందిని, శరణ్య, కుశాల్, వాజీద్, రాజేశ్వర్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల్లో హర్షద్ కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి డీఈవో వినోద్, జిల్లా వైద్యాధికారి రజిత, ఎంఈవో కృష్ణహరి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## పంటపొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మల్యాల: మండలంలోని రామన్నపేట-రాంపూర్ గ్రామాల మధ్య ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఓగులాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల మనోజ్ కారులో గంగాధర మండలం నుంచి వస్తుండగా రామన్నపేట గొల్లపల్లె దాటిన తరువాత మూలమలుపు వద్ద కారు వేగంగా ఉండడంతో అదుపుతప్పి వరి పంటలలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో కారులో గల మనోజ్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది.

## భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య



శ్రావ్య (ఫైల్)

శంకరపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో భర్త వేధింపులు భరించలేక భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన శ్రావ్య (27)కు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి గ్రామానికి చెందిన అమ్మిగల్ల ధర్మతేజతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో గత రెండేళ్ల నుంచి శ్రావ్య తన తల్లిగారి గ్రామం తాడికల్‌లో ఉంటోంది. భర్త ధర్మతేజ్ మానసికంగా వేధిస్తూ అవమానిస్తూ ఉండడంతో మనస్థాపానికి గురై తాడికల్‌లోని తన తల్లిగారి ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి సోదరుడు గొట్టె శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



సురేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ముగ్దం సురేష్(29) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. కొంత కాలంగా సురేష్ మద్యానికి బానిసై పనిచేయక ఖాళీగా తిరుగుతున్నాడు. కుటుంబాన్ని పోషించే విషయంలో తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. పనిచేయకుండా అందినకాడికి అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో సురేష్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణం పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

సైదాపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండంలోని సర్వాయిపేట గ్రామ శివారులోగల సర్వాయి పాపన్న గుట్టల వద్ద నర్మిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఆదేశించారు. మంగళవారం ఆమే పాపన్న గుట్టలను సందర్శించి పర్యాటక కేంద్రంలో బాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పర్యాటక శాఖ డీఈ నటరాజ్ పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల తిప్పలు



సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

గన్నేరువరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంటలను సాగు చేసుకున్న రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంకు మంగళవారం 450 బస్తాల యూరియా రావడంతో సమాచారం అందుకున్న రైతులు ఉదయం నుంచి భారీగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. గంటల తరబడి నిరీక్షించినప్పటికీ కొంమందికి మాత్రమే యూరియా బస్తాలు దొరకగా మిగిలిన వారు నిరాశతో వెనుదిరిగారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సొసైటీ వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. వెంటనే సరిపడా యూరియా అన్ని గ్రామాల్లోని ఎరువుల దుకాణాలకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## హనుమాన్ విగ్రహం ధ్వంసం



పరిశీలిస్తున్న పోలీసులు

రాయికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపల్లి గ్రామ శివారులోని చిరుతల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వాగు సమీపంలో ఉన్న ఈ గుడిలో గ్రామస్థులు చాలా ఏళ్లుగా పూజలు నిర్వహిస్తున్నారు. అయితే మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన గ్రామస్థులకు హనుమాన్ విగ్రహం ధ్వంసమై ఉండటం, ఆలయ ఆవరణలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుధీర్‌రావు తన సిబ్బందితో వెళ్లి విచారణ జరిపారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై త్వరలో నిందితులను పట్టుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

# హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- వృద్ధుడిని హత్య చేసిన తండ్రీకొడుకులు
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ అనిల్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మెటపల్లి సీఐ వి అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన నానం చిన్న హన్మండ్లు, అతని కుమారుడు నానం రాకేష్ సకినపల్లి కాశీం(62) అనే వృద్ధుడిని కర్రలతో బాది హత్య చేశారు. 15 సంవత్సరాల క్రితం కాశీం భూమి పక్కన చిన్న హన్మండ్లు కొంత భూమిని కొనుగోలు చేశాడు. అందులో ఉన్న పాత వ్యవసాయ బావిని పూడ్చి ఆక్రమించుకోవడానికి నిందితులు ప్రయత్నించగా సకినపల్లి కాశీం అడ్డుపడ్డాడు. దీంతో వారి మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. కాశీం తన స్థలంలో బాత్రూం నిర్మించుకోగా, నిందితులు అది తమ స్థలంలో నిర్మించారని ఆరోపిస్తూ అడ్డుపడ్డారు. ఈ వివాదంపై గతంలో పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా పరిష్కారం కాలేదు. దీంతో తండ్రీకొడుకులు ఎలాగైనా కాశీంను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. కాశీం ఈ నెల 2న రాత్రి సమయంలో తన పెద్ద కొడుకు లక్ష్మీనరసయ్య ఇంట్లో భోజనం చేసి నడుచుకుంటూ వస్తుండగా రోడ్డుపై అడ్డగించి దాడి చేశారు. కర్రతో అతని తల, ముఖంపై, చాతీపై బలంగా కొట్టారు. తీవ్ర రక్తస్రావంతో కాశీం అక్కడికక్కడే మరణించాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడు కాశీం పెద్ద కొడుకు సకినేపల్లి లక్ష్మీనరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు హన్మండ్లు ఊరిలోని ఓ పెద్ద మనిషికి ఫోన్ చేసి తామే హత్య చేసినట్లు చెప్పడంతో పోలీస్‌లు నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆగస్టు 4న గోధుర్ రోడ్డు సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కర్ర, మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

## వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడలో జెట్టి మాన్విక్ అనే మూడు సంవత్సరాల బాలుడిపై వీధి కుక్కలు మంగళవారం దాడి చేశాయి. ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడి తల, మెడ, గొంతుపై కుక్కలు కరవడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడికి తీవ్ర గాయలు కావడంతో ప్రథమచికిత్స చేసి నిజామాబాద్ అసుపత్రికి తరలించారు. నెల రోజుల క్రితం కుక్కలు పట్టణంలో తొమ్మిది మంది విద్యార్థులను కరిచాయి. దీంతో మున్సిపల్ అధికారులు తూతూ మాత్రంగా కుక్కలను పట్టుకొని తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు రెండురోజులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కుక్కల బెడదల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మౌంట్ ఎల్బ్రోస్‌ను అధిరోహించిన తండ్రీకొడుకులు




మౌంట్ ఎల్బ్రోస్ పర్వతంపై బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న తండ్రీకొడుకులు మల్లారెడ్డి, వివేకానందరెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యూరప్ ఖండంలోని ఎత్తయిన శిఖరం మౌంట్ ఎల్బ్రోస్ పర్వతాన్ని(18,150 అడుగుల) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన లెంకల మహిపాల్ రెడ్డి, అతని కుమారుడు వివేకానంద రెడ్డిలు అధిరోహించారు. పర్వతారోహణకు గత నెల 28న రష్యాకు వెళ్లి ఐదు రోజుల శిక్షణ అనంతరం ఈ నెల 3న అధిరోహించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా అక్కడ సే నోటుడ్రగ్స్ అనే బ్యానర్‌ను ఆవిష్కరించారన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వారిని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ లెంకల మహిపాల్ రెడ్డి మాజీ సైనికుడిగా ఇప్పటికే 12 పర్వతాలను అధిరోహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించారన్నారు. వివేకానందరెడ్డిని కూడా పర్వతారోహణ చేయాలనే ఉద్దేశ్యంతో తండ్రి మహిపాల్‌రెడ్డి వద్ద ఏడాదిగా శిక్షణ పొందారని తెలిపారు. మరిన్ని పర్వతాలను అధిరోహించి దేశానికి పేరు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## శిథిలావస్థలో మ్యూజియం



మ్యూజియంలోని పురా వస్తువులు

- పట్టించుకునేవారు కరువు
- భవన నిర్మాణం చేపట్టాలని వినతి
- నామ మాత్రంగా కరీంనగర్ జిల్లా పర్యాటక శాఖాధికారి పోస్టు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లోని ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియం శిథిలావస్థకు చేరుకుంది. ఉత్తర తెలంగాణలోని మూడు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర పురావస్తు శాఖ సహాయ సంచాలకుల కార్యాలయ భవనాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. యాభై ఏళ్లు దాటిన భవనాలు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలుతాయోనని భయాందోళన నెలకొంది.

### ● మ్యూజియం... భవనాల లెక్కలు

1969లో అప్పటి విద్యాశాఖ మంత్రి పీవీ నరసింహారావు ప్రత్యేక చొరవతో 20 గుంటల ప్రభుత్వ స్థలంలో మ్యూజియం, కార్యాలయ భవనాల నిర్మాణాలు చేపట్టారు. మ్యూజియంపైన సహాయసంచాలకుల కార్యాలయం ఉంది. అర ఎకరంలో ఉన్న ఈ మ్యూజియం స్థలంలో సుమారు ఐదు గుంటలు 2013లో కమాన్ నుంచి ముఖరంపుర వరకు జరిగిన రోడ్ వెడల్పులో



మ్యూజియం ముఖద్వారం

హరించుకుపోయిందని, ప్రస్తుతం 15 గుంటల వైశాల్యంలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీని విలువ గుంటకు కోటి రూపాయలు చూసుకున్నా మార్కెట్‌ధర ప్రకారం 15 కోట్ల స్థలంగా భావిస్తున్నారు. రెండస్థుల ఈ మ్యూజియంలో ఖాళీ స్థలం 70 శాతం ఉంది. స్తంభాలు లేని భవనాలు కావడంతో వర్షాలకు నానుతూ, ఎండకు ఎండుతూ ఉన్నాయి.

### ● ఏళ్లు గడుస్తున్నా.. ఆచరణ శూన్యం

మ్యూజియంను ఆనుకొని ఉన్న కలెక్టర్ బంగ్లాను కలుపుకొని నూతన భవనాలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ఏళ్లు గడుస్తున్నా ఆచరణ సాధ్యం కావడం లేదు. అధికారులు, నాయకులు సందర్శించినా మరమ్మతుకు నోచుకోలేదు. వెయ్యి కోట్ల స్మార్ట్ సిటీ పథకం కింద ఎన్నో ప్రభుత్వ భవనాలు చేర్చినా పురావస్తు శాఖ భవనాలకు నిధులు కేటాయించలేదు. ఇప్పటికైనా కొత్త మ్యూజియం భవనం నిర్మించాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

### ● నిర్వహణ భారం

పురావస్తు శాఖ శాఖలో నిధులు, సిబ్బంది కొరతతో మ్యూజియం, కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది. ఏడాదిన్నర నుంచి ఇన్‌చార్జిగా ఉన్న జిల్లా పర్యాటక శాఖాధికారి పోస్టును నామమాత్రం చేసి నెహ్రూ యువ కేంద్రం అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. మ్యూజియానికి అనుబంధంగా ఉన్న చారిత్రాత్మక కట్టడాలు, సాంస్కృతిక, పర్యాటక కేంద్రాలను, చిహ్నాలను కూడా పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

### మ్యూజియంలో విలువైన పురావస్తు సంపద..

మ్యూజియంలో లక్ష సంవత్సరాల పాతరాతి యుగం ఆనవాళ్లు ఉన్నాయి. చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ సేకరించిన ఆదిమ మానవుల రాతి పనిముట్లు భద్రపరిచారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న శాతవాహనుల కోటి లింగాల బౌద్ధ స్తూప ఖండికలు, లఘు శాసనాలు, నాణేలు దర్శనమిస్తాయి. వేములవాడ, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, పొలవాస రాజుల కాలం నాటి శిలా, రాగి శాసనాలు ఉన్నాయి. శాతవాహనుల మొక్కట్‌రావుపేట శాసనాలు, పాశిగాం బౌద్ధ స్తూపం, మధ్యయుగం నాటి శిలా, బౌద్ధ జైన, నాగిని, యుద్ధవీరుల విగ్రహాలు కనిపిస్తాయి. ఇత్తడి కళా ఖండాలు, పీటీ రెడ్డి పేయింటింగ్స్, గుర్రాల బొమ్మలు, కుతుబ్‌షాహీలు, మొఘలాయిలు, నైజాం కాలం నాటి పింగాణీ వస్తువులు ఆకట్టుకుంటాయి. 150 ఏళ్ల ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ ఇంజనీయర్ ఫ్రెంచ్



మ్యూజియంలోని బౌద్ధ పలకలు

అధికారి సమాధి ఫలకం, కత్తులు, బౌద్ధప్రతిమలు, ప్రతాపరుద్రుడు, ధర్మపురిలో సేకరించిన ఆంజనేయస్వామి, వేములవాడలో సేకరించిన గాయత్రీ విగ్రహాలు కనిపిస్తాయి. ధూళికట్ట బౌద్ధ స్తూప పలకలు, తెలుగుకు ప్రాచీన హోదా తెచ్చిన కురిక్యాల బొమ్మలగుట్ట త్రిభాషా శాసనం, జగిత్యాల, ఎలగందుల, కాళేశ్వరం శిలా విగ్రహాలు మ్యూజియం పరిధిలో ఉన్నాయి.

## బ్యాంకు అవకతవకలపై చర్చకు సిద్ధమా?

● అర్బన్ బ్యాంకు చైర్మన్ విలాస్ రెడ్డి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకులో 2007 నుంచి 2017 వరకు కొనసాగిన పాలకవర్గం అవకతవకలపై చర్చకు సిద్ధమా అని అర్బన్ బ్యాంకు చైర్మన్ విలాస్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వాల రద్దు విషయంలో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ ఆరోపణలు అవాస్తవమన్నారు. బ్యాంకు సర్వసభ్య సమావేశం 1964 సహకార చట్టం ప్రకారం జరిగిందని, ఒకసారి కోరం లేక వాయిదా వేస్తే అదే సభను తిరిగి ఏరోజైతే సభ ఉంటుందో అదేరోజు సభ నిర్వహించుకునే హక్కు ఉంటుందని అన్నారు. 2009లో కళాభారతిలో నిర్వమించిన మహాసభకు 1780 మంది హాజరయ్యారని తప్పుడు రికార్డు సృష్టిస్తూ బైలాను మార్చారని, కళాభారతిలో 300 మంది కెపాసిటీ ఉంటే 1780 మందిని ఎక్కడ కూర్చోబెట్టారని ప్రశ్నించారు. నకిలీ బంగారం విషయంలో కిందివారిపై చర్య తీసుకోకుండా అప్పుడున్న సీఈవోను సస్పెండ్ చేశారన్నారు. బ్యాంకు సభ్యత్వాలను లెడ్జర్‌లో దిద్దడం, అవకతవకలకు పాల్పడడంపై అధికారులు విచారణ జరిపి ఇచ్చిన నివేదిక మేరకు కోర్టు



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

ఆనాటి 15 మంది పాలకవర్గ సభ్యుల శాశ్వత సభ్యత్వాన్ని తొలగించాలని ఆదేశాలు ఇచ్చిందని, వారి సభ్యత్వాలను రద్దు చేశామని తెలిపారు. గత పాలకవర్గం హయాంలో 15 వేల మంది సభ్యులను చేర్పించారని, అకౌంట్ లేనప్పటికీ సభ్యత్వాలు ఇచ్చారని అన్నారు. సమావేశంలో మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యాసాగర్, మార్క రాజు ఉన్నారు.

## బ్యాంకు పరువు తీసేలా చైర్మన్ వ్యాఖ్యలు

- అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకు పీఏసీ కమిటీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు బ్యాంకు పరువును బజారుకీడ్చే విధంగా ఉన్నాయని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ అన్నారు. మంగళశారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2007 నుంచి 2015 వరకు చైర్మన్‌గా, 15 మంది సభ్యులతో పాలకవర్గంగా పనిచేశామని గుర్తుచేసిన విలాస్‌రెడ్డి తమ పాలనపై ఇప్పుడెందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. గత నెల 27న జరిగిన జనరల్ బాడీ సమావేశం కోరం లేక వాయిదా పడిందని, ఈ నెల 3న మరోసారి 208 మంది సభ్యులతో సమావేశం పెట్టినా అదే పరిస్థితి ఎదురైందని అన్నారు. సహకార చట్టం ప్రకారం ఈ సమావేశాలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. తమపై ఇప్పటి వరకు ఎలాంటి చట్టబద్ధమైన విచారణ జరగలేదని పేర్కొన్నారు. 1982లో బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి 25 ఏళ్లలో 24 కోట్లు మాత్రమే డిపాజిట్ కాగా, తమ పాలనలోనే 60 కోట్ల డిపాజిట్లు



మాట్లాడుతున్న మాజీ అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్

వచ్చాయని వివరించారు. 2017 తర్వాత 8 ఏళ్లలో కేవలం 10 కోట్లు మాత్రమే పెరిగాయన్నారు. విలాస్ రెడ్డికి సభ్యత్వాలు రద్దు చేసే హక్కు లేదని, కోర్టు ఆర్డర్ వస్తే అక్కడ తేల్చుకుంటామని అన్నారు. సమావేశంలో మాజీ పాలకవర్గ సభ్యులు బాశెట్టి కిషన్, వరాల జ్యోతి, లక్ష్మణ్ రాజు, అనరాసు కుమార్, సాయికృష్ణ, క్రాంతి, తాడ వీరారెడ్డి ఉన్నారు.

## ఎస్సారెస్పీలో 40.304 టీఎంసీల నీరు

● 2,850 క్యూసెక్కులు రాక

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి వరద నీరు రావడం కొనసాగింది. డ్యామ్‌లోకి 4,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు ప్రస్తుతం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 793 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.204 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

## ఎల్లంపల్లి నీటిని సిద్దిపేట తరలిస్తుంటే ఏం చేశారు?

● పదేళ్లలో నీళ్ల వాటా సాధించనోళ్లు ఇప్పుడు గేట్లు బద్దలు కొడతారట ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖని, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన అల్లుడు హరీష్‌రావులు ఎల్లంపల్లి నుంచి నీటిని సిద్ధిపేట, గజ్వేల్‌కు తీసుకెళుతుంటే నోరుమెదపని కొప్పుల ఈశ్వర్ ఇప్పుడు కన్నెపల్లి గేట్లు బద్దలు కొడతానని చెబుతున్నాడని రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిలక్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లంపల్లి కట్టినప్పుడు తుమ్మిడిహెట్టి వద్ద నుంచి కాలువలు తవ్వినప్పుడు ఈశ్వర్ ఎమ్మెల్యేనని, కాళేశ్వరం కట్టినప్పుడు మంత్రిగా ఉన్నాడన్నారు. మేడారం ఎమ్మెల్యేగా రామగుండం రైతుల ప్రయోజనాల కోసం నోరుమెదపలేదని, ఉమ్మడి జిల్లా రైతాంగానికి నీటి గురించి మాట్లాడలేదన్నారు. అదనపు టీఎంసీ పేర ధర్మపురి నియోజకవర్గంలో భూ సేకరణకు రూ.8లక్షలు, చొప్పదండిలో ఎకరానికి రూ.20లక్షలు ఇచ్చారన్నారు. కూలిపోయిన ప్రాజెక్టులో నీళ్లు నిల్వ చేస్తే ప్రాజెక్ట్ కొట్టుకుపోతుందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చిందని, అలాగే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో కూడా పగుళ్లు, లీకేజీలు ఉన్నట్టు చెప్పిందన్నారు. కన్నెపల్లి నుంచి నీటిని తరలించి బ్యారేజీల్లో నీరు నింపడం కూడా ప్రమాదకరమని ఎన్‌డీఎస్‌ఏ చెబుతుందన్నారు. కేంద్ర నిపుణుల కమిటీ సూచన మేరకు రెండు మూడు నెలల్లో బ్యారేజీల మరమ్మతు చేస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసం కట్టారని, తుమ్మిడిహెట్టి వద్ద కట్టే అవకాశం ఉన్నా కట్టలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో నాగార్జున సాగర్, శ్రీశైలం, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు కట్టామని, అవి ఇప్పటికీ నాణ్యతగా ఉండి రైతాంగానికి నీరు ఇస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్‌లో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వాళ్ల హయాంలోనే కూలిందన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మరో కమలహాసన్ అని, ఆయన లోపల ఒక ఈశ్వర్, బయట ఒక ఈశ్వర్ ఉంటారని లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ చేసిన అప్పులకు ప్రతి నెల 6వేల కోట్లు వడ్డీలే కడుతున్నామని, కాళేశ్వరం కార్పొరేషన్ పేర ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకుల నుంచి అడ్డగోలుగా అప్పులు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పైసాపైసా పోగు చేసి ఉద్యోగులకు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

1వ తేదిన వేతనాలు ఇస్తున్నామని, 2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామని, ప్రతి ఇంటికి సన్న బియ్యం, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 58వేల మంది నిరుద్యో గులకు ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికలో కేసీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి బండారాన్ని బయట పెట్టారని, దీనిపై అసెంబ్లీ వేదికగా చర్చ పెడతామన్నారు. కాల్వలింగస్వామి, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, ముస్తాఫా ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిరిసిల్ల జిల్లాకు పతకాలు




పతకాలను అందుకుంటున్న అభిరామ్, ప్రేమ్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు మూడు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. అండర్-20 హైజంప్ అభిరామ్, అండర్-16 విభాగంలో 80 మీటర్స్ హడిల్స్‌లో మామిండ్ల రుచిత, అండర్-20 విభాగం షాట్‌పుట్‌లో అజ్మీరా ప్రేమ్‌కుమార్ రజత పతకాలను సాధించారు. అండర్-20 విభాగంలో 10కే వాక్‌లో శ్రీపతి విక్రమ్ కాంస్య పతకాన్ని సాధించాడు. జిల్లాకు రజత, కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గొట్టె రాంచంద్రం, సంయుక్త కార్యదర్శి అజయ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కనకం శ్రీనివాస్ సభ్యులు హరీష్, గంగధార్, అశోక్, బాబు, నవీన్ అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లు రాలేదని ఆత్మహత్యాయత్నం



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న దంపతులు

చిగురుమామిడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు రాలేదని అదే గ్రామానికి చెందిన వంతడ్పుల శ్రీనివాస్-సృజన దంపతులు మంగళవారం నిరసన తెలిపారు. శ్రీనివాస్ కొంత పెట్రోల్ తాగి కొంత ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకోగా పెట్రోల్ డబ్బాతో రహదారిపై ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీనివాస్ -సృజన దంపతులను 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితులు విలేకరులతో మాట్లాడుతూ తమకు పాత ఇళ్లు ఉందని ఎలాంటి ఆస్తిపాస్తులు లేవన్నారు. ఇందిరమ్మ ఇంటికి తాము అర్హులమైనా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇల్లు మంజూరు కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు విడుతల్లో ఇళ్లు రాకపోవడంతో గత్యంతరం లేక ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహ రించడంతో పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

## ఘనంగా ఆదివరాహ జయంత్యుత్సవాలు

కమాన్‌పూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలు మంగళవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నిత్యాభిషేకంతోపాటు గోపూజను ఆలయ ప్రధాన అర్చకులు కలకుంట్ల వరప్రసాద్, ఆలయ ఈవో కాంతరెడ్డి, వేద పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. మొదటి రోజు హవనము, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు స్వామి వారిని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యూనివర్సిటీ ప్రగతికి న్యాక్ గుర్తింపు అవసరం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపించాలంటే జాతీయస్థాయి నాక్ గుర్తింపు అవసరమని, దీంతో నాణ్యత పెరుగుతుందని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. నాక్ గుర్తింపులో భాగంగా నాక్ సంచాలకులు డాక్టరు శ్రీరంగ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. అధ్యాపకులు మరింత పరిశోధన చేయడానికి తోడ్పడుతుందని, సదస్సును మరింత ఉపయోగకరంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం మౌలానా ఆజాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం అభ్యాస ఆచార్యులు డాక్టర్ రమ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సంస్థాగత అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని అన్నారు. విశ్వవిద్యాలయ నాక్ సంచాలకులు శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులు నైపుణ్యాలు, అభ్యాసాలను పెంచుకోవాలనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉస్మానియా రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీపతిరావు ప్రొఫెసర్ వీర సోమయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, ఓఎస్డీ టు వైస్ చాన్సలర్ డాక్టర్ హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, డాక్టర్ జయంతి పాల్గొన్నారు.

### ఎస్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో హాస్టల్ వసతి

గణేశ్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హుస్నాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈ సంవత్సరం నుంచి బాలికలకు, బాలురకు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పించనున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ, జనగాం నాలుగు జిల్లాల గ్రామీణ విద్యార్థులకు హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీ గొప్ప అవకాశమన్నారు. అత్యుత్తమ విద్య మౌలిక సదుపాయాలతోపాటు హాస్టల్ వసతి కల్పించడం ద్వారా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

## ఆలయాల్లో శ్రావణ సందడి

మల్యాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించు కున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్య వేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

### నరసింహుడి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

**ధర్మపురి:** ధర్మపురి నరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ మంగళ వారం పెరిగింది. శ్రావణ మాసం పురస్కరించుకుని క్షేత్రానికి ఉద యం వరకు భారీగా భక్తులు తరలి వచ్చారు. అనంతరం గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. అక్కడి నుండి స్థానిక లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మ కర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విష్ణు సహస్రనామ పారాయణం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో గల శేషప్ప కళావేదికపై శారదా మహిళా మండలి సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శారదా మహిళా మండలి సభ్యులను ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ అభినందించారు.



### శాకంబరీ దేవిగా మానసాదేవి

**గన్నేరువరం:** శ్రావణమాస వేడుకల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం ఖాసింపేట మానసాదేవి ఆలయంలో మంగళవారం మానసాదేవి శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలోని మానసాదేవి, అపురూప లక్ష్మి అమ్మవార్లతో ఆంజనేయ, శ్రీచక్రానికి కూరగాయలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు.

## నియామకం



కూర సురేష్

గంభీరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా గంభీరావుపేటకు చెందిన కూర సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తరావు పటేల్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. కాగా, గంభీరావుపేటలోని నాయకమ్మ ఆలయంలో మంగళవారం కూర సురేష్ పూజలు నిర్వహించారు. అనంతరం సంఘం తరపున సురేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లేశం, మండల యూత్ అధ్యక్షుడు అయిలేని బాబు, కార్యదర్శి శ్రీను, ఆదర్శ సంఘం(1) అధ్యక్షుడు సిరిపురం రవి, ఆదర్శ సంఘం(2) అధ్యక్షుడు బోయినగారి లింగం, బోయనగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కనగర్తిలో టీబీ పరీక్షలు

కోనరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తిలో మండల వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో టీబీ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతకు జ్వరం తగ్గకపోవడం, అలసట, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. టీబీ నిర్ధారణ అయితే వారి పోషణ ఆహార నిమిత్తం 6నెలల వరకు వెయ్యి రూపాయల చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈవ్యాధి నయం అయ్యేవరకు ప్రభుత్వమే మందులు అందజేస్తుందని అన్నారు. వైద్య సిబ్బంది మెర్సీ రషీద్, జత్య, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన ఒగ్గు మల్లయ్య, గట్టు రాజయ్య కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

## గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం..

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరేశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, కిరణ్‌నాయక్, బాలకృష్ణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఇల్లంతకుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని పలు గ్రామాల రైతులకు వ్యవసాయ నిపుణుడు గారంపల్లి శ్రీకాంత్ అవగాహన కల్పించారు. మండలంలోని ముస్కానిపేట, అనంతారం, రామోజీపేట, వల్లంపట్ల గ్రామాలలో మంగళవారం నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలపై రైతులకు వివరించారు. జీవామృతం తయారీ, వాడే విధానంపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈవోలు గంగ, జ్యోతి, రవళి, అర్చన, లలిత, అర్చన, అభిషేక్, కృషి సఖులు అనసూయ, అమీదా, శైలజ, విజయలక్ష్మి, మమత, రేణుకలతో పాటు రైతులు పాల్గొన్నారు.

## పంటలపై అవగాహన పెంచుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కళాశాలల విద్యార్థులు అన్నిరకాలైన పంటలుపై అవగాహన పెంచుకోవాలని ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని పొత్తూరు, కందికట్కూర్ గ్రామాలలో మంగళవారం మహాత్మ జ్యోతిబా పూలే కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ సదస్సు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేలల రకాలు, వనరులు, గ్రామాల సమస్యలపై తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈఓ లలితలతో పాటు రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ రహస్య ఒప్పందాలు..

ముస్తాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందంతో ప్రభుత్వ స్థలాలు కబ్జా జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలోని నామాపూర్ శివారులో గల 410 సర్వే నంబరులోని పల్లగుట్టను, తెర్లుమద్ది శివారులోని 608 సర్వే నంబరులో ఎమ్మెల్సీ కవిత పేరిట భూములు కబ్జా అయ్యాయని ఆరోపించారు. చెరువులు, వాగులు, ఒర్రెలు, కెనాల్ భూములను ఆక్రమిస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. భూముల కబ్జాలో ప్రభుత్వ పెద్దలకు ముడుపులు ముట్టాయని, కలెక్టర్‌పై తమకు పూర్తివిశ్వాసం ఉందని, వాటిపై విచారణ చేసి కబ్జా చేసిన భూములను వెనక్కితీసుకొని పేదలకు పంచాలని కోరారు. వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు మెంగని మహేందర్, చిగురు వెంకన్న, చిట్నేని శ్రీనివాస్‌రావు, కోల కృష్ణ, పున్నం అనిల్, తిరుపతియాదవ్, శ్రీకాంత్‌గుప్తా పాల్గొన్నారు.

## అట్టడుగువర్గాల ప్రజలకు మేలు జరగాలన్నదే లక్ష్యం

ఇల్లంతకుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అట్టడుగు వర్గాల ప్రజలకు మేలు జరగాలన్నదే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం అని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రేపాక గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీలకు అండగా నిలుస్తున్న పథకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే అవి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు మాత్రమే అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొండ్ల మధుసూదన్‌రెడ్డి, మామిడి హరీష్, బొల్లం రాంసాగర్, అంతగిరి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## బోర్‌వెల్‌కు భూమిపూజ

వేములవాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఫాజుల్‌నగర్ గ్రామంలోని ముదిరాజ్ సొసైటీ సంఘం వద్ద బోర్‌వెల్‌కు మాజీ వైస్‌ఎంపీపీ జక్కుల కవిత తిరుపతి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. 2లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో బోరుబావి వేస్తున్నట్లు వారు తెలిపారు. కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధులతో గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిందం కుమార్, లక్కాకుల కుమార స్వామి, గంగుల ప్రసాద్, బోగోజు అరుణ్, ఎగుర్ల రాజు, మంద శ్రీనివాస్, బొక్కెన వెంకటేశం, సంఘం నాయకులు పోగుల మల్లేశం, ఉప్పరి పెద్దులు, పిట్టల లచ్చిరాజం, గంగుల ప్రసాద్, ముత్యం శంకర్, లచ్చయ్య, మల్లవేణి సురేష్, చిరవేణి మహేష్, రేగుల శంకర్, మల్లేశం, చివేణి మల్లేశం, రేపాక లింగరాజు, ప్రభాకర్, సత్యం, కొత్త మల్లేశం పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి..

వేములవాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మల్లారం గ్రామం రెవెన్యూ పరిధిలోని రాజానగర్ సర్వే నంబర్ 213లోగల 5గుంటల స్థలాన్ని కొందరు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని వ్యాపారం నిమిత్తం షెడ్ కూడా వేశారని గ్రామస్థులు మంగళవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. సమగ్రంగా విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ..

తంగళ్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎంఈవో రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు చేతుల మీదుగా సైకిళ్లను అందజేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా మంగళవారం పాఠశాలలో చదువుతున్న 69 మంది పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిలుముల శంకర్ నారాయణ, నాయకులు ఇటికల రాజు, నులుగొండ శ్రీనివాస్, కోన్నీ వినయ్‌యాదవ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, కోడం భవిత, సిలివేరి ప్రశాంత్, కలికోట చరణ్,ఇటికల మహేందర్, జలపతి, కృష్ణ, నందగిరి నవీన్, అమరగొండ రాజు, గోనపల్లి శ్రీనివాస్, రేగుల రాజు, బాల మల్లేశం, కట్ట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో పతకాలు..

గంభీరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గంభీరావుపేటకు చెందిన సైమా అకాడమీ క్రీడాకారులు సత్తాచాటారు. పోటీల్లో 9 మంది క్రీడాకారులు పాల్గొని, 7 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు సాధించారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

# ప్రమాదపుటంచున ప్రయాణం..

- రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు - సరైన రవాణా సౌకర్యం లేకపోవడమే కారణం..



సామర్థ్యానికి మించి ప్రయాణికులతో వెళుతున్న ఆటో(ఫైల్)



బోల్తా పడిన ఆటో(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఒక వైపు సామర్థ్యానికి మించి ప్రయాణికులు, పాఠశాలల విద్యార్థుల తరలింపు.. మరోవైపు అతివేగం.. మద్యం మత్తు కారణంగా ప్రయాణికులు, చిన్నారుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. డ్రైవర్ల అజాగ్రత్త వల్ల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆటోల వేగంపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మండలంలో ఆటో ప్రమాదాలు అధికమవుతున్నాయి. మూడు నెలల్లో 20 ఆటో ప్రమాదాలు జరగడం భద్రత ఎంత మేరకు ఉందో అద్దం పడుతోంది. ఇద్దరు మృతిచెందగా, 40 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈనెల 5న మండల కేంద్రం శివారులో విద్యార్థులో వెళుతున్న ఆటో కుక్కలను తప్పించబోయి బోల్తాపడింది. 8 మంది విద్యార్థులు గాయాల పాలయ్యారు. ఒకరి కాలు విరిగిపోయింది. మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, నారాయణపూర్, తిమ్మాపూర్, గుండారం, తదితర గ్రామాలకు రోడ్డు ఉన్నా ఆర్టీసీబస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఒక్కో ఆటోలో సుమారు 15నుంచి 18 మంది ప్రయాణికులు, చిన్నారులను డ్రైవర్లు తరలిస్తున్నారు.మితిమీరిన వేగం, మద్యం మత్తుతో పాటు అధిక సౌండ్ వల్ల ఆటో డ్రైవర్లు తమ వాహనాలతో దూసుకుపోతున్నారు. అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నాయి.

### ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక..

మండలంలోని రాచర్లబొప్పాపూర్, కోరుట్లపేట, రాజన్నపేట, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, నారాయణపూర్, అక్కపల్లి, దుమాల, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపకపోవడంతో ఆయాగ్రామాల ప్రజలు, విద్యార్థులకు ఆటోలే దిక్కవుతున్నాయి. పలుమార్లు తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపించాలని కోరుతూ సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోంది. దాంతో ఆటోవాళాలు సామర్థ్యానికి మించి ప్రయాణికులు, విద్యార్థులను తరలిస్తున్నారు. అతివేగంగా దూసుకెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. ఆటోలపై సంబంధిత శాఖ అధికారుల దృష్టి సారించకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు సామర్థ్యానికి మించి ప్రయాణికులు, విద్యార్థుల తరలింపు, అతి వేగం, మద్యంమత్తు, ఆటోలో అధిక సౌండ్ సిస్టమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుని ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు, కోరుతున్నారు.

## 'బోనస్' రాకపాయె..!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. కానీ బోనస్ ఎప్పుడు వస్తుందా అని రైతులకు ఎదురుచూడక తప్పడం లేదు. జిల్లాలో యాసంగి సీజన్లో 244 కొనుగోలు కేంద్రాల ద్వారా 44767 మంది రైతుల నుంచి రూ 627.50 కోట్లు విలువైన 2.70 లక్షల మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 2.61 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 9554 మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యంలో ఐకెపి ద్వారా 7561 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 1588 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 104 మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 1255 మంది రైతులు సన్నరకం బోనస్‌కు అర్హులుగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బోనస్ బకాయిలు రూ 4.62 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

### 2.43 లక్షల ఎకరాల్లో సాగు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43వేల 783 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు.. వరి సాగు లక్షా 84 వేల 860 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇప్పటివరకు 2 లక్షల ఎకరాల వరకు వివిధ సాగు చేశారు. ఇందులో వరినాట్లు 1.45 లక్షల ఎకరాలు, పత్తి 45,900 ఎకరాలు, మొక్కజొన్న 3,923 ఎకరాలు, కందులు 572 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు.

# ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కోనరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వాహకులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హెచ్చరించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం, గౌరీ శంకర్ ఫెర్టిలైజర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ సెంటర్లు, గోదాముల్లో మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా బస్తాలను తెప్పించి అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో దానికి అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియా అధిక వాడకం వలన కలిగే నష్టాలను రైతులకు వ్యవసాయ అధికారులు, దుకాణాల నిర్వాహకులు వివరించాలని ఆదేశించారు. యూరియాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై వివరించాలని తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక వేళ యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, సీసీ టీవీ కెమెరాలు లేని గోదాములలో వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వరలక్ష్మి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందిరా మహిళ శక్తి'లో ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలు

కోనరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు పకడ్బందీగా వ్యాపారం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేటలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం ద్వారా విశ్వదర్శనీ గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళశక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డెయిరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నత్త నడకన కల్వర్టు నిర్మాణ పనులు

- ఇబ్బందుల్లో విద్యార్థులు, ప్రయాణికులు..



కోనరావుపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో నిలిచిపోయిన కల్వర్టు పనులు

కోనరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో లోలెవల్ కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో మూడు రోజుల క్రితం కాంట్రాక్టర్ నూతన కల్వర్టు నిర్మించడానికి పనులు ప్రారంభించాడు. కానీ నత్తనడకన పనులు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. మండలకేంద్రానికి వచ్చే ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. నిమ్మపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల దూరం నడిచి మండల కేంద్రానికి వస్తున్నారు. విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ప్రయాణికులు నిమ్మపెల్లి గ్రామ శివారు నుండి సిరిసిల్లకు వెళ్తున్నారు. కానీ ఆర్టీసీ బస్సులు రాక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలగజేసుకొని వెంటనే కల్వర్టు నిర్మాణం శరవేగంగా జరిగేలా చూసి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ బస్సులు మండల కేంద్రానికి వచ్చే విధంగా చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

### 11న ఇంటర్వ్యూలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలు, కళాశాలలో ఆంగ్లమాధ్యమంలో బోధించడానికి అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈనెల11న ఇంటర్వ్యూలు, డెమోలు నిర్వహించనున్నట్లు ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ స్కూల్స్ ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ అంజలి ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్ జువా లజీ(మహిళ), జేఎల్ కెమిస్ట్రీ(మహిళ), జేఎల్ ఇంగ్లీష్(జనరల్), పీజీటీ మాథ్స్(జనరల్, మహిళ), పీజీటీ ఫిజికల్ సైన్స్(జనరల్, మహిళ), పీజీటీ ఇంగ్లీష్(మహిళ), టీజీటీ ఇంగ్లీష్(జనరల్) సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థులు పీజీ, బీఏడ్ పూర్తిచేసిన వారు ఈనెల 11న కరీంనగర్ తిమ్మపూర్ మండలం మహాత్మా జ్యోతిబాపూలే ఎల్ఎండీ కాలని(బాలికలు) పాఠశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

## గంగాధర ఆలయంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఇల్లంతకుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గంగాధర ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మంగళవారంను పురస్కరించుకొని మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని వివిధ రకాలైన పూలతో ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగరాజుశర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని దుర్గాదేవీ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు గుండయ్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలను అత్యంత వైభవంగా జరిపించారు. మహిళలు భక్తిశ్రద్ధల నడుమ ఒడిబియ్యం పోశారు. చల్లగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేశ్, లక్ష్మారెడ్డి, లింగారెడ్డి, కిషన్, బాల్‌రెడ్డి, పర్శరాములు, నారాయణ, సంజీవరెడ్డి, ముత్యంరెడ్డి, స్రవంతి, వరలక్ష్మీ, మమత, జ్యోతి, రాజేశ్వరి, లక్ష్మీ, ఉమ ఉన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమైనవి..



అన్న ప్రాసన్న చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య

చందుర్తి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు తల్లిపాలు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. చందుర్తి మండలంలో తిమ్మాపూర్, రామన్నపేట, ఆశిరెడ్డి పల్లె, గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నెలల నుంచి ఏడవ నెల ప్రారంభమైన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమంతో పాటు అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భవతులు, ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి తీసుకోవాలని తల్లులకు సూచనలు చేశారు. 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలు అందరూ అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈడీఎస్ సూపర్‌వైజర్ టి.శంకరమ్మ, అంగన్వాడీ టీచర్లు మంగ మంగాదేవి, గంగాజల మంజుల పాల్గొన్నారు.

● కోనరావుపేట : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కనకమ్మ అన్నారు. కోనరావుపేట మండలం మంగళపల్లి, మర్తన్నపేట, సుద్దాల, నిమ్మపల్లి తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని అన్నారు. తల్లిపాల పోషక విలువలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోటగళ్ల శారద, సునీత, శారద, మరియా, నర్సమ్మ, గౌరీశ్వరి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : పుట్టిన బిడ్డకు తల్లిపాలు చాలా శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి అన్నారు. వీర్నపల్లి మండల సెక్టార్ లెవల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమంతాలు, అక్షరభ్యాసం, అన్నప్రాసన, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలలవరకు తల్లిపాలను మాత్రమే పట్టించాలన్నారు. తల్లిపాలల్లో చాలా రకాల విటమిన్స్ ఉంటాయని అవే బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతాయని పేర్కొన్నారు. తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన పరిశుభ్రతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మల్లేశం యాదవ్, సూపర్‌వైజర్ సంతోషిణి, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిర, సెక్టార్ అధ్యక్షురాలు జ్యోతి, మల్లీశ్వరి, ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం ఉదయలక్ష్మి, ఏఎన్ ఎంలు కీర్తి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# బూటకపు నివేదికలతో ప్రభుత్వం కుట్ర..



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై బూటకపు నివేదికలతో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై కుట్రచేస్తోందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశానికి కొండూరు రవీందర్‌రావు హాజరయ్యారు. ముందుగా మాజీ మంత్రి హరీష్‌రావు తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను స్క్రీన్ ద్వారా వీక్షించారు. అనంతరం రవీందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించక ముందు కేవలం 60లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యేదని, ఇప్పుడు కోటి 50 లక్షల ఎకరాల్లో సాగు అవుతోందన్నారు. వ్యవసాయానికి పురిటి గడ్డ లాంటి పంజాబ్, హర్యానా రాష్ట్రాలను తెలంగాణ మించి పోయిందన్నారు. కాంగ్రెస్ పాలించిన కాలంలో ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించలేకపోయిందని, బీఆర్ఎస్ హయాంలో కేవలం నాలుగేళ్ల వ్యవధిలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. వాళ్ల హయాంలో కాని పనులు బీఆర్ఎస్ హయాంలో చేయడంపై కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులకు తిరిగి భూమిపూజలు చేస్తూ 20నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చించాలని, అప్పుడే అసలు నిజాలు ప్రజలకు తెలుస్తుందన్నారు. అబద్ధపు హామీలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్‌కు రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు పెద్దవేణి వెంకటి. పార్టీ మాజీ అధ్యక్షులు లింగన్నగారి దయాకర్‌రావు, నాయకులు లింగమ్‌యాదవ్, వహీద్, రాజేందర్, కరువారి శంకర్, శ్రీమతి, సత్తవ్వ తదితరులు ఉన్నారు.

## అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ప్రాజెక్టు సందర్శన

బోయినపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారని, తాము చేసిన అవినీతి బయటపడుతుందని ఉద్దేశంతో కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని బోయినపల్లి మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, తన వ్యక్తిగత నిర్ణయంతో ఏ ఇంజనీర్లను సంప్రదించకుండా తానే కమీషన్ల కోసం నిర్మించి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందని అప్పుడే ఎందుకు మరమ్మతులు చేయలేదని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ కుంగడమే కాకుండా సుందిళ్ల ప్రాజెక్టు బుంగ పడడంతో నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉన్న విషయం తెలిసిందేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోని తెలంగాణ తెచ్చుకుంటే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన విషయం నిజం కాదా అని అన్నారు. కేవలం రైతులను తప్పుదోవ పట్టించేందుకే డ్యామ్‌ను బీఆర్ఎస్ నాయకులు సందర్శించారన్నారు. కేసీఆర్‌కు ప్రభుత్వంలో ఉన్నప్పుడు అవినీతిగా సంపాదించిన ఆస్తి ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంభలక్ష్మి రాజం, ఏనుగుల కనకయ్య, పొత్తూరి మహేందర్‌లు ఉన్నారు.